



సూపర్ సిక్స్-సూపర్ హిట్ బహిరంగ సభావేదికలో ఆశీనులైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బిజెపి అధ్యక్షుడు మాధవ్



కూటమి సభ సూపర్‌హిట్

- భారీగా జనసమీకరణ
- 'అనంత' పసుపుమయం
- చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌తో పాటు జిల్లా మంత్రుల ప్రసంగం
- సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేశామన్న చంద్రబాబు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

'సూపర్ సిక్స్ -సూపర్ హిట్' పేరుతో కూటమి పార్టీలు అనంతపురంలో చేపట్టిన బహిరంగ సభ సూపర్ హిట్ అయ్యింది. రాయలసీమ ప్రాంతీయ సదస్సుకు నాలుగు జిల్లాల నుంచి పెద్దఎత్తున జనం తరలొచ్చారు. నగరం చుట్టూ పసుపు జెండాలు పట్టుకుని తరలిరావడంతో మొత్తం పసుపుమయంగా మారింది. మధ్యాహ్నం 12 గంటల నుంచే జనం బహిరంగ సభ జరుగుతున్న అనంతపురం నగరంలోని ముత్యాల్‌రెడ్డి లేఅవుట్ గ్రౌండ్‌కు చేరుకోవడం ఆరంభమైంది. మధ్యాహ్నానికి మైదానం ఫుల్ అయింది. ఆ తరువాత నగరంలో అనేక చోట్ల వస్తున్న వాహనాలతో ట్రాఫిక్ జామ్ అయింది. మధ్యాహ్నం రెండున్నర గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌లు వేరువేరుగా హెలీకాప్టర్లలో అనంతపురం నగరం చేరుకున్నారు. వేదికపై వీరిద్దరితోపాటు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్‌లు ఒకేసారి వచ్చారు. సూపర్ సిక్స్ -సూపర్ హిట్ జెండాలను చేతపట్టుకుని ప్రజలకు అభివాదం చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధ్యక్షతన బహిరంగ సభ ప్రారంభమైంది. మొదట మాట్లాడిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రానికి అందుతున్న సహకారం గురించి వివరించారు. అదే సందర్భంగా ఈ కూటమి పాలన సుదీర్ఘకాలం కొనసాగాలని ఆకాంక్షించారు. ఆ తరువాత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రసంగించారు. ఆయన ప్రసంగం పది నిమషాల్లో ముక్తసారిగానే ముగిసింది. ఆయన శాఖ పరిధిలో అమలు జరుగుతున్న పథకాల గురించి మాత్రమే వివరించారు. చివరగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ప్రసంగం సుదీర్ఘంగా సాగింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతోపాటు, గడిచిన ఐదేళ్ల వైఫల్యాలను ఈ సందర్భంగా ఎత్తిచూపారు. అధికారం ప్రజలకు సేవ చేయడానికి అని భావించి మెలగాలని మూడు పార్టీల కార్యకర్తలకు ఈ సందర్భంగా హితబోధ చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు వంగలపుడి అనిత, నారాయణ, అచ్చంనాయుడు, నాదేండ్ల మనోహర్, కొలుసు పార్థసారధి, రాంప్రసాద్‌రెడ్డితో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, ఎంపీలు అంబికా లక్ష్మినారాయాణ, బికె.పార్థసారధి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శ్రావణి, దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్, కందికుంట వెంకట ప్రసాద్, అస్మిత్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, ఎంఎస్.రాజు, పల్లె సింధూరారెడ్డి, అమిలినేని సురేంద్రబాబుతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

హంద్రీనీవా పూర్తి చేస్తాం
ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

హంద్రీనీవా ద్వారా అనంతపురానికి నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. భైరవానితిప్ప, పేరూరు ఎత్తిపోతల పథకాలను ఈ ఏడాదిలోపు పూర్తి చేసే విధంగా కృషి చేస్తామని తెలిపారు. బహిరంగ సభ ముగింపులో అనంతపురం జిల్లాను ఉద్దేశించి ప్రత్యేకంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రసంగించారు. అదేవిధంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పనులను చేపడతామని హామీనిచ్చారు. అనంతపురం జిల్లా అంటే తనకు ప్రత్యేకమైన అభిమానం ఉందన్నారు. ఈ జిల్లాభివృద్ధికి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటామని భరోసానిచ్చారు.



4వేల కిలోమీటర్ల రోడ్లు వేశాం
ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 4వేల కిలోమీటర్ల కొత్త రోడ్లు వేశామని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలియజేశారు. సూపర్ సిక్స్ హామీలతో గత ఎన్నికల్లో ఘన విజయం సాధించామని చెప్పారు. ఇప్పుడు దీన్నీ అమలు చేసామని తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో ఎక్కడా డోలిమోతలు లేకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. స్థానికంగానే ఉపాధి అకాశాలు కల్పించే పరిశ్రమలు నెలకొల్పే ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు.

క్లెప్టోక్రసీ గ్యాంగ్‌ను భూస్థాపితం చేయాలి
సత్యకుమార్ యాదవ్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

వైసిపి హయాంలో నింగి, నేల, ధూళి ఇలా పంచభూతాలన్నింటినీ కబ్జా చేసారని రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ విమర్శించారు. క్లెప్టోక్రసి గ్యాంగ్‌లా ఉన్న దీనిని భూస్థాపితం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం యూనివర్శల్ హెల్త్ పాలసీ తీసుకురావడం ద్వారా రాష్ట్రంల ప్రతి పౌరుడు ఉచిత వైద్యసదుపాయాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గడిచిన ఐదేళ్ల వైసిపి పాలన, పరదాలు, బ్యారికెడ్ల చాటున సాగిందని యెద్దేవ చేశారు.



వైసిపివి తప్పుడు ప్రచారాలు
సవితమ్మ , బిసి సంక్షేమ శాఖ మంత్రి

వైసిపి చేస్తున్నవన్నీ తప్పుడు ప్రచారాలేనని బిసి సంక్షేమ శాఖమంత్రి సవితమ్మ విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 మాసాల్లో సూపర్ సిక్స్ అమలు చేసి ప్రజలకిచ్చిన మాటలను నిలుపుకున్నట్టు తెలిపారు.




సూపర్ సిక్స్- సూపర్ హిట్ బహిరంగ సభ వేదికపై కూటమి పార్టీల కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, నాయకులు

మున్సిపల్ రిజర్వ్ స్థలాలను కాపాడాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం పట్టణంలోని రిజర్వు స్థలాలలో అక్రమంగా మట్టి తవ్వి తరలిస్తున్నారని, ఆ రిజర్వ్ స్థలాలను కాపాడాలని మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, వైస్ చైర్మన్లు శంషాద్ బేగం, జయరాం రెడ్డి కోరారు.. ఈ సందర్భంగా వారు కౌన్సిలర్లతో కలిసి మున్సిపల్ ఇంచార్జ్ కమిషనర్ కి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 27వ వార్డు వైయస్సార్ కాలనీలో పాఠశాల పక్కన ఉన్న మున్సిపల్ రిజర్వ్ స్థలంలో జెసిబి లతో ఇష్టారాజ్యంగా తవ్వడంతో పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయన్నారు. అక్కడే కాకుండా ఎక్కడ మున్సిపల్ పరిధిలో ఖాళీ స్థలాలు కనపడితే అక్కడ అధికార పార్టీ అండ చూసుకొని కొంతమంది గుంతలు పెట్టి మట్టి తవ్వుకొని వెళుతున్నారని విమర్శించారు.. ఆ గుంతల్లో నీరు చేరి ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులకు సమాచారం తెలిసిన కూడా ఏ చర్యలు తీసుకోకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. ఇలాగే తవ్వకాలు కొనసాగితే మున్సిపల్ ఆఫీస్ ఎదురుగా ఆందోళన కార్యక్రమాలను చేపడతామని హెచ్చరించారు. స్పందించిన కమిషనర్ మాట్లాడుతూ అధికారులతో వెంటనే విచారణ చేపట్టి తగిన న్యాయం చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు బాలిరెడ్డి, మూసపల్లి సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి కమిషనర్‌కు ఛైర్‌పర్సన్ వినతి



ఇన్‌ఛార్జి కమిషనర్‌కు వినతి ఇస్తున్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ లక్ష్మి, వైస్ చైర్మన్లు

'స్వచ్ఛత'పై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పురం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

ప్రజాశక్తి-హిందూపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని అమలు పర్చుతున్న స్వభావ్ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత పక్షోత్సవాల నిర్వహణ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం తన చాంబర్‌లో మున్సిపల్ ఎంఈ దస్తగిరితో కలిసి శానిటరి ఇన్స్ పెక్టర్‌లు, శానిటేషన్ సెక్రేటరీలు, మేస్త్రీలతో సమీక్షా సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు పక్షం రోజుల పాటు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్వభావ్ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛత పక్షోత్సవాలలో భాగంగా సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి కార్యదర్శి వారి సచివాలయ పరదిలో ఈ నెల 14వ తేదీ నాటికి సిటియులను గుర్తించి మ్యాపింగ్ పూర్తి చేసి, ఎస్‌హెచ్ఎస్ ఐటి పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 15 నుంచి స్వభావ్ స్వచ్ఛత సంస్కార్ స్వచ్ఛతపై ప్రచారాలను ముమ్మరం చేస్తు, ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. 25న స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శ్రమదాన కార్యక్రమం నిర్వహించి బహిరంగ ప్రదేశాలను శుభ్రపరచాలన్నారు. పారిశుధ్యకార్మికులు రోగాల బారిన పడే అవకాశం ఉన్న నేపథ్యంలో సఫాయి సురక్ష కార్యక్రమం కింద కార్మికులకు ఉచితంగా అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులు ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఇంజనీయర్లతో పాటు శానిటరి ఇన్స్‌పెక్టర్లు శంకర్, నిజాంతో పాటు శానిటరి సెక్రేటరీలు పాల్గొన్నారు.



సమీక్ష సమావేంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం



పిహెచ్‌సి రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఓ మంజువాణి

ప్రజాశక్తి-లేపాక్షి

స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పిహెచ్‌సి)ను బుధవారం జిల్లా ఉప వైద్యాధి కారి మంజువాణి సందర్శిం చారు. ఆమె పిహెచ్‌సిలో అమలవుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిపై ఆరా తీశారు. అలాగే రికార్డులను పరిశీలించి నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. వర్షాకా లం, రాబోవు కాలానుగుణంగా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచిం చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందు బాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల వైద్యాధికారి రాజ్‌కుమార్, సిహెచ్ఓ సీతాలక్ష్మి, ఎంపిహెచ్ఓ సుబ్రహ్మణ్యం, పిఎచ్ఎన్ భాగ్యలక్ష్మి, ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి
జెఎన్‌టియు ప్రిన్సిపల్ చెన్నారెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

ఇంజినీరింగ్ విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని జెఎన్‌టియు ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో మేధా సర్వో డ్రైవ్స్ ప్రయివేట్ లిమిటెడ్ వారు ప్రాంగణ నియామకాలు చేపట్టారు. నియామకాల్లో 118 విద్యార్థులకు రాత పరీక్షను నిర్వహించారు. రాత పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి ముఖాముఖి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు మేధా సర్వో డ్రైవ్స్ ప్రయివేట్ లిమిటెడ్ హెచ్ఆర్ ప్రతినిధి బిందు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవడానికి తగిన శిక్షణను ముందుగానీ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాంగణ నియామకాల అధికారి జె.శ్రీనివాసులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న జెఎన్‌టియు ప్రిన్సిపల్ చెన్నారెడ్డి

ఎయిర్ పాలీ క్లినిక్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ప్రారంభం



ఎయిర్ పాలీ క్లినిక్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఫైర్ స్టేషన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎయిర్ పాలీ క్లినిక్ చిల్డ్రన్స్ హాస్పిటల్ ను బుధవారం జెవివి కార్యదర్శి డాక్టర్ ఈటి రామ్మూర్తి, తేజా అసుపత్రి వైద్యులు వెంకటేశ్వర్లుతో కలిసి మున్సిపల్ ఛైర్మన్ రమేష్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు తక్కువ ఫీజుతో నాణ్యమైన వైద్య సేవలను అందించడానికి వైద్యులు రిజ్వానా యాస్మిన్, ఇందాదుల్లా ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు బాలాజి, కేశవులు, ప్రజా సంఘాల నాయకులు కల్లూరు ఉమ్మర్ ఫారుక్ ఖాన్, వేణుగోపాల్ రెడ్డి, ఉదయ్ కుమార్, చైతన్య గంగిరెడ్డి, ఒపీడీఆర్ శ్రీనివాసులు. మాండలిక కవి చిదంబర్ రెడ్డి, జన విజ్ఞాన వేదిక సభ్యులు, సామాజిక సేవకులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి సహకారం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం ప్రెస్ క్లబ్ అభివృద్ధికి తన వంతుగా అన్ని విధాలా సహకరిస్తానని వైసిపి మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ప్రెస్ క్లబ్ పై భాగంలో భవన నిర్మాణం కోసం తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని చెప్పారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ సమీపంలో బుధవారం ఎయిర్ పాలీ క్లినిక్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం కొండూరు వేణుగోపాల్ రెడ్డి ప్రెస్‌క్లబ్‌కు వచ్చి పాత్రికేయులతో మాట్లాడారు. ప్రెస్ క్లబ్ పై భాగంలో రెండు రూములు నిర్మించాలని పాత్రికేయులు కోరగా స్పందించి ఆయన రెండు రూముల నిర్మాణానికి అవసరమైన రూ. 3 లక్షలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈసందర్భంగా పాత్రికే యులు కొండూరు వేణుగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రా నిక్, ప్రింట్ మీడియా పాత్రికేయులు పాల్గొన్నారు.



వేణుగోపాల్ రెడ్డిని సన్మానిస్తున్న పాత్రికేయులు



సమావేశంలో మాట్లాడుతున్న వక్ఫ్ ఇన్‌సెక్టర్ నజీర్

సబ్ లీజుకు ఇస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని జామీయ మసీదు ఆధీనంలో ఉన్నా వాణిజ్య భవనాలను లీజుకు తీసుకున్న వారు సబ్ లీజుకు ఇస్తే వారిపై కఠిన చర్యలను తీసుకుంటామని వక్ఫ్ బోర్డు ఇన్స్‌పెక్టర్ నజీర్ సాహెబ్ హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని అల్ హి లాల్ పాఠశాల ఆవరణంలో ఉన్నా జామీయ మసీదు కార్యలయంలో లీజు దారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గత 10 సంవత్సరాల నుండి జామీయా మసీదు కమిటీ వారు బాడుగలు పెంచాల్సి ఉన్నప్పటికి పెంచలేదన్నారు. ప్రతి సంవత్సరానికి 10శాతం ప్రకారం పెంచకపోవటం వల్ల మార్కెట్ రేటు ప్రకారం కూడా ప్రస్తుత వక్స్ ఆస్తులు గదుల బాడుగలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. వక్ఫ్ చట్టం 1995 (2025) ప్రకారంపెంచాల్సి ఉందన్నారు. దీనికి అద్దెకు ఉంటున్న వారు పెంచడానికి అంగీకరించారు. అదే విధంగా వక్ఫ్ చట్ట ప్రకారం సబ్ లీజుకు ఇవ్వడం చట్టరీత్యా నేరమని లీజు దారులకు సూచించారు. దీంతో పాటు ప్రస్తుతం అద్దెకు ఉంటున్న 26 మంది అద్దెలు సరిగ చెల్లించడం లేన్నారు. మొత్తం రూ. 26.65 లక్షలు బకాయిలున్నాయన్నారు. వీరందరు 15 రోజులలోపు చెల్లించాలన్నారు. సకాలంలో చెల్లించక పోతే 16వ రోజు వారి లీజును రద్దు పరచి, చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామన్నారు. ఈ సమావేశంలో వక్ఫ్ అధికారి అబ్దుల్ ఖాదిర్ తో పాటు లీజుదారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటాలు
మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు,
అనంత జిల్లా మున్సిపల్ ఉద్యోగ కార్మికసంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి దశలవారీ పోరాటాలు చేయనున్నట్లు మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ తెలిపారు. బుధవారం నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో ఎటిఎం నాగరాజు అధ్యక్షతన జిల్లా మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం జిల్లా మహాసభ నిర్వహించారు. ముందుగా గత మహాసభ నుంచి మున్సిపల్ కార్మికులు చేసిన పోరాటాల ద్వారా వచ్చిన విజయాలు.. పరిష్కారంక ఆని సమస్యలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు దశాబ్ధాల తరబడి పని చేస్తున్న ప్రభుత్వాలు బానిసలుగా మార్చేవిధంగా ఔట్ సోర్సింగ్ పేరుతో వెట్టిచాకిరీ చేయిస్తున్నాయన్నారు. మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, ఇంజినీరింగ్ కార్మికుల జీవో 36 ప్రకారం వేతనాలు అమలు చేయాలని, 12వ పిఆర్‌సి అమలు చేయాలని, పర్మినెంట్ కార్మికులకు బాకాయి ఉన్న 4 సలెండర్ లీవ్‌లు వెంటనే ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్‌లతోపాటు పర్మినెంట్ చేయాలని తీర్మానం చేశారు. కాగా ఆయా సమస్యల పరిష్కారానికి ఈనెల 18వతేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపల్, పట్టణాల్లో నిరసన ర్యాలీలు, 20, 21, 22వతేదీల్లో రాష్ట్రకేంద్రంలో మూడు రోజులపాటు దీక్షలు, 24న విజయవాడలో మహాధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎటిఎం నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా కె.నాగభూషణ, కోశాధికారిగా బత్తల ఆదినారాయణ, పాధ్యక్షులుగా లక్ష్మీనరసమ్మ (అనంతపురం), రామాంజినేయులు (గుత్తి), రంగనాయకులు (గుంతకల్లు), రామాంజినేయులు (తాడిపత్రి), సహాయ కార్యదర్శులుగా మంత్రి వరలక్ష్మి (అనంతపురం), తిరుమలేష్ (అనంతపురం), రాము (రాయదుర్గం), వన్నూరుస్వామి (కళ్యాణదుర్గం)ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి జిల్లా మున్సిపల్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలో మాట్లాడుతున్న మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు



పిహెచ్‌సి తనిఖీ

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి మంజువాణి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లావణ్య, ఇతర వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలతో కలిసి కేంద్రంలోని ఆరోగ్య సేవల పనితీరును సమీక్షించారు. రికార్డులు పరిశీలించారు. ఆరోగ్య పర్యవేక్షణ, శిశువులకు టీకాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రస్తుత సీజనల్ వ్యాధుల పెరుగుదల దృష్ట్యా ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. డెంగీ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని, గ్రామాల్లో నీటి నిల్వలు లేకుండా శుభ్రత పాటించాలని ఆదేశించారు.

జాబ్ మేళా

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్, సిడాప్ ఆధ్వర్యంలో ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సహకారంతో స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్ మేళాకి 10 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాకు సుమారు 112 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 67 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఈకార్యక్రమంలో ధర్మవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ సురేష్ బాబు , బాల జోషి, ప్లేస్ మెంట్ అధికారి తేజ్ కుమార్, స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సిబ్బంది, సీడాప్ సిబ్బంది, ఎంప్లాయిమెంట్ అధికారి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి బియ్యం అందజేత

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్ల పల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాల కరస్పాండెంట్ ఎం.ఎస్. కిరణ్ కర్నాటక రాష్ట్రం బెంగళూరులో ఉన్న సోకేర్ ఐ ఎన్ డి అనాథశ్రమానికి బియ్యం అందజేశారు. బుధవారం నాలుగు బస్తాలు బియ్యం, 25 కిలోల జామ పండ్లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ హరీష్ స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసధార సేవా సంస్థ ద్వారా అనాథ పిల్లల కోసం తమవంతుగా సాయం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సో కేర్ అనాథశ్రమం సెక్రటరీ నాగేష్ బాబు, సభ్యులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎస్‌డిజిఎస్ కళాశాలలో విద్యార్థులకు శక్తి యాప్‌పై అవగాహన సదస్సును ప్రిన్సిపల్ జె.ఎస్.వి.ఎస్ ప్రసాద్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్ కానిస్టేబుల్ రవి నాయక్, పోలీస్ సిబ్బంది సుధాకర్, కొల్లప్ప, రమాదేవి శక్తి యాప్‌పై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో యన్ యస్ యస్ సమన్వయకర్త బి రాజన్న, యన్‌సిసి లెఫ్ట్ నెంట్ యమ్‌ఆర్ ఫణింద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రికి ఘన స్వాగతం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ బహిరంగ సభకు వెళ్లడానికి పుట్టపర్తి విమానాశ్రయం చేరుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు పుట్టపర్తి విమానాశ్రయంలో అధికారులు, కూటమి నాయకులు బుధవారం ఘన స్వాగతం పలికారు. హైదరాబాదు నుండి నేరుగా ప్రత్యేక విమానంలో పవన్ కళ్యాణ్ 1:30 గంటలకు పుట్టపర్తి చేరుకున్నారు. విమానాశ్రయంలో కూటమి నాయకులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. అదేవిధంగా శ్రీ సత్య సాయి జిల్లా కలెక్టర్ ,టీఎస్ చేతన్, జిల్లా ఎస్పీ వి రత్న, జె సి అభిషేక్ కుమార్, ఆర్డీవో సువర్ణ, ఎక్సైజ్ ఎస్ ఈ గోవింద నాయక్, అటవీ శాఖ అధికారి చక్రపాణి, ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం అక్కడే వేచి ఉన్న ప్రత్యేక హెలికాప్టర్లో 1: 40 గంటలకు బయలుదేరి అనంతపురం సభకు తరలి వెళ్లారు. ఈ సందర్భంగా సత్య సాయి సెంట్రల్ ట్రస్ట్ చైర్మన్ ఆర్ జె రత్నాకర్, సాయి ఆరామం గంగాధర్, నాయకులు లాయర్ హరికృష్ణ, బాలగంగాధర్, జ్యోతి ప్రసాద్ తదితరులు ఆయనను కలిశారు.

కొత్తచెరువు : అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమానికి వెళ్లేందుకు పుట్టపర్తి విమానాశ్రయానికి వచ్చిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను పుట్టపర్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ పూల శివప్రసాద్ కలిశారు. ఆయనకు ఒకే అందజేసి అభినందనలు తెలిపారు. తనకు ఈ పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

వాటర్ బాటిళ్లు అందజేత

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

అనంతపురం వేదికగా బుధవారం జరిగిన సూపర్ సిక్స్-సూపర్ హిట్ కార్యక్రమం విజయవంతంలో టిడిపి ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ చొరవ చూపారు. ఎండ వేడిమి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జనం ఇబ్బంది పడకుండా తగిన సాయం అందించేలా ఏర్పాట్లు చేశారు. సభకు భారీగా తరలివస్తున్న జనం కోసం పరిటాల కుటుంబం తరపున లక్ష యాభై వేల మందికి సరిపడేలా 4రకాల పండ్లు, వాటర్ బాటిళ్లు, బిస్కట్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. తన సొంత ఖర్చులతో వీటిని శ్రీరామ్ ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు శ్రీరామ్ టీం శ్రమించి వీటిని ప్యాక్ చేశారు. సభా వేదిక చుట్టుపక్కల ప్రాంతంలో వాహనాల పార్కింగ్ వద్ద 15 బృందాలను ఏర్పాటు చేసి వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు శ్రీరామ్ చొరవను ప్రత్యేకంగా అభినందించారు, అదేవిదంగా ధర్మవరం పట్టణంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సందా రాఘవ కార్యకర్తలకి భోజనాలు అందజేశారు, పార్థసారధి నగర్ 24 వార్డు నుండి ఆ వార్డు ఇంచార్జి మంజునాథ్ ఆధ్వర్యంలో ఈ సభకి కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు.

నేపాల్‌లో జిల్లావాసులుంటే తక్షణ సహాయక చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

నేపాల్‌లో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా జిల్లా వాసులు అక్కడ ఉండి ఇబ్బందులు ఎదుర్కొంటుంటే తక్షణం కలెక్టరేట్ లో సంప్రదించాలని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదలైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు అలాంటి బాధితులు ఉంటే వారికి భద్రత సంక్షేమం కోసం జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయడానికి సిద్ధంగా ఉందన్నారు. నేపాల్ లో మన జిల్లా కోసం సంబంధించి ఎవరైనా పౌరులు గాని, యాత్రికులు గానీ చిక్కుకొని ఇబ్బందులు పడుతుంటే కలెక్టరేట్ లో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 08555289039 అనే నెంబర్ కు ఫోన్ చేసి తెలపవచ్చున్నారు.

స్నేహితుడికి విజయనగరం ఎంపీ పరామర్శ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్రంలో గల తన చిరకాల స్నేహితుడైన కట్టుబడి సుభహాన్‌ను విజయనగరం ఎంపీ కలిశంశెట్టి అప్పలనాయుడు బుధవారం పరామర్శించారు. గతంలో విజయనగరంలో తాము స్నేహితులుగా ఉన్నామన్నారు. అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ బహిరంగ సభ వెళుతున్న సందర్భంగా తన చిరకాల స్నేహితుడు కలవాలని ఇక్కడికి వచ్చానని ఎంపీ చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ సి కొండయ్య, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు ఏ వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుధ్యం

ప్రజాశక్తి - నల్లచెరువు

నల్లచెరువు మండలం పరిధిలోని 13 పంచాయతీల్లో 73 గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. దీంతో ఆయా గ్రామాల్లో పలువురు అనారోగ్యం పాలవుతున్నారు. విషజ్వరాల బారిన పడి ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులకు వెళుతున్నారు. ఒక ఇంట్లో ఒకరి నుంచి ఇంకొకరికి ఈ జ్వరం రావడంతో భయాందోళనకు గురవుతున్నారు. ఆయా గ్రామాల్లో పారిశుధ్యం లోపించడంతో మురుగునీరు నిల్వ ఏర్పడి దోమలకు నివాసాలుగా మారాయి. పారిశుధ్య చర్యలు తీసుకోవాటంలో అధికారులు, పాలకులు విఫలమయ్యారు. గతంలో మురుగునీరు ఉన్నచోట బ్లీచింగ్ చల్లేవారు. ప్రస్తుతం అలాంటి చర్యలు కనబడడం లేదు. నల్లచెరువు ప్రభుత్వ ఆసుపత్రిలో ఒపి సంఖ్య గణనీయంగా పెరిగింది. నొప్పులు, తలనొప్పి, జ్వరంతో బాధపడుతున్నారు. ఈ విషయం జిల్లా అడిషనల్ డిఎం అండ్ హెచ్ఒ స్థానిక ఆసుపత్రిని విజిట్ చేసి రోగులను పరామర్శించారు. ఈ తరుణంలో ఆయా గ్రామాల్లో హెల్త్ సిబ్బంది తీసుకోవలసిన ఆరోగ్య జాగ్రత్తలు అవేర్నెస్ ప్రోగ్రాములు పెట్టకపోతే ప్రైవేటు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లే రోగుల సంఖ్య మరింత పెరిగే ప్రమాదం ఉంది.



రోడ్డుమీద ఏర్పడిన మురుగు గుంత

ఆలయాల్లో చోరీ

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని రెండు ఆలయాల్లో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. మండల కేంద్రానికి సమీపంలోని స్వయంభు బైరవేశ్వరస్వామి ఆలయంలో అర్ధరాత్రి 1 గంట ప్రాంతంలో ఆలయంలో ముగ్గురు దుండగులు ప్రధానద్వారాల తాళాలు పగొలగొట్టి లోనికి ప్రవేశించి హుండీలోని సుమారు రూ. 50 వేలు ఎత్తుకెళ్లారు. ముఖాలకు టవాళ్లుచుట్టుకొని రాడ్లు వినియోగించి హుండీను పగొలగొట్టారు. అక్కడే ఉన్న బీరువాను బలవంతంగా తెరచి అందులోని వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. సీసీ టీవీలను గమనించి వాటిని ధ్వంసం చేశారు. అలాగే ప్రసిద్ధ కనుమ లక్ష్మీనారసింహస్వామి ఆలయంలో కూడా ప్రవేశించిన దుండగులు హుండీ పగులగొట్టారు. హుండీలో ఏమీ లేకపోవడంతో వెళ్లిపోయారు. ఒకే రోజు ఇలా ఆలయాలను లక్ష్యంగా ఎంచుకొని దొంగతనాలకు తెగబడ్డారు.

కదిరి టౌన్ : కదిరి రూరల్ మండలంలోని యర్రదొడ్డి గంగమ్మ ఆలయంలో మంగళవారం గుర్తు తెలియని దుండుగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలోని హుండీ పగలగొట్టి నగదు దోచుకెళ్లారు. దీంతో ఆలయ అధికారులు రూరల్ అప్గ్రేడ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి : ఎపి రైతుసంఘం

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బలవంతపు భూసేకరణ ఆపాలని ఎపిరైతుసంఘం జిల్లా అధ్యక్షులు హరి డిమాండ్ చేశారు. స్థానిక వైయస్సార్ సర్కిల్లో బుధవారం 2013 భూ సేకరణ చట్టం గురించి తెలిపే బుక్‌లెట్లను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 2013చట్టంలో ఏముంది? ప్రభుత్వం బలవంతంగా పోలీసులను ఉపయోగించి భూములను లాక్కుంటే భూ రక్షణ కోసం మనం ఏం చేయాలి అనేది ఈ బుక్‌లెట్‌లో ఉందన్నారు. రాష్ట్రంలో వివిధ రకాల అభివృద్ధి పేరుతో ఏడాదికి రెండు మూడు పంటలు పండే సారవంతమైన లక్షలాది ఎకరాల భూమిని సన్న చిన్న కారు రైతుల నుండి బలవంతంగా తీసుకుంటున్నారన్నారు. అలాంటప్పుడు మనం ఏం చేయాలి అని తెలుసుకోవడానికి 2013 చట్టం ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రభుత్వం భూసేకరణ కోసం మన దగ్గరికి వస్తే ఏం చేయాలి? భూ రక్షణ కోసం ఈ చట్టంలో ఉన్నటువంటి ముఖ్యమైన అంశాలను ఇందులో ఉన్నాయన్నారు. రైతులు, ప్రజలు ఈ పుస్తకాన్ని చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎపి రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు బి.సుధాకర్ రెడ్డి, జి. రామిరెడ్డి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రమణ,, స్థానిక రైతులు ప్రభాకర్ రెడ్డి, నరసింహారెడ్డి, వెంకట రమణ, నారాయణ, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏపీ రైతు సంఘం మండల కన్వీనర్ గా జి. రామిరెడ్డి (నల్లగుట్ట పల్లి)ని ఎన్నుకున్నారు.



బుక్‌లెట్ విడుదల చేస్తున్న నాయకులు

చాకలి ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం



ఐలమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి సిపిఎం కార్యాలయంలో కామ్రేడ్ చాకలి ఐలమ్మ 40వ వర్ధంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సత్య సాయి జిల్లా సిపిఎం కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ కామ్రేడ్ చాకలి ఐలమ్మ ఒక విప్లవాత్మక మహిళా స్వాతంత్ర్య సమరయోధురాలని అనానరు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొందన్నారు. భూమి కోసం పోరాటం మొదలుపెట్టి భూఆక్రమణలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడానికి ఒక వేదికను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బ్యాల్ల అంజి, పైపల్లి గంగాధర, సాకే వెంకటేష్, ఆఫీస్ కార్యదర్శి సిద్దు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : పేదల పక్షాన భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటం చేసిన గొప్ప యోధురాలు చాకలి ఐలమ్మ అని పలువురు కొనియాడారు. చాకలి ఐలమ్మ 40వ వర్ధంతి సందర్భంగా కదిరి పట్టణంలోని చాకలి ఐలమ్మ దోబీ ఘాట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు . ఈ సందర్భంగా పలువురూ మాట్లాడుతూ భూమికోసం భుక్తి కోసం పేద ప్రజల కోసం భూ పోరాటాలు చేసి లక్షలాది ఎకరాలను పంచిపెట్టిన ఘనత చాకలి ఐలమ్మది అన్నారు. తెలంగాణలో భర్తను బిడ్డలను పోగొట్టుకొని సొంత ఇంటిని ఆఫీసు ఏర్పాటు చేసుకొని పెత్తందారులను సైతం తరిమి తరిమి కొట్టడంలో ముందుండి పోరాటం చేసిన వీర వనతి చాకలి ఐలమ్మ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక సంఘ జిల్లా అధ్యక్షులు బాపనపల్లి శ్రీనివాసులు, జిల్లా గౌరవ అధ్యక్షులు కనుముక్కల లక్ష్మన్న, జిల్లా ఉపాధ్యక్షులు తలుపుల గంగన్న, సహాయ కార్యదర్శి నల్లబల్లి శంకర్, రజక ఉద్యోగ సంఘాల కదిరి కన్వీనర్ రామ్ కుమార్, బీసీ నాయకుడు చింత నాగరాజు, పట్టణ అధ్యక్షుడు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : తెలంగాణ గడ్డపై నిజాం నవాబుల నిరంకుశత్వానికి వ్యతిరేకంగా భూమి కోసం బానిసత్వ విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమనిరాష్ట్ర రజక సంఘం ఉపాధ్యక్షుడు బాపనపల్లి శివప్ప పేర్కొన్నారు. బుధవారం ఎనుములపల్లిలో ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆ సంఘం నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాటి నిర్బంధాలను తట్టుకుని నిరంకుశ పాలనపై ధ్వజమెత్తిన ఆమె జీవితం చరిత్రలో నిలిచిపోతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో రజకులతో పాటు వాల్మీకులు, యాదవులు, వడ్డెరలు, మాజీ కౌన్సిలర్లు, పోతన్న, సత్తి, నాగరాజు, చెన్నకేశవులు, జిల్లా ఉపాధ్యక్షులు యనమల గంగాధర్, నియోజకవర్గ అధ్యక్షులు గంగాధర్, చిరంజీవి యాదవ్, వీర జిన్నప్ప, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

తలుపుల :మండలంలోని రజకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ 40 వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎగువపేట కుమ్మరిపేట పల్లె నుండి రజకులు హాజరై ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసంఘం తలుపుల మండలం అధ్యక్షుడు జివి రమణ, నారాయణ, కుమ్మరిపేట రవి, అది, ఆంజనేయులు, ఓబులమ్మ, వాణి, అరుణ, రమేష్, బాబు, పులిగిల్లపల్లి బాబు, సులేకుంపల్లి రామ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులను ఆదుకోవాలి



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-హిందూపురం

వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక శాతం రైతులు ఆధారపడి జీవనం సాగిస్తున్న పాడి పరిశ్రమను అన్ని విధాలా ఆదుకోవాలని అఖిల భారత వ్యవసాయ, కూలీల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్ అండ్ బి అతిథి గృహం నుండి రెవెన్యూ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా కార్యదర్శి వి.రంగనాయకులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు ఎం.గిరీష్ మాట్లాడుతూ, జిలాల్లో వేలాదిమంది రైతులు పాల ఉత్పత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని తెలిపారు. రైతులు తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పాడి పరిశ్రమ వైపు దృష్టి సారిస్తున్నారన్నారు. పాల ఉత్పత్తి వల్ల రైతులకు కొంత వరకు ఆర్థిక భారం తగ్గిందని తెలిపారు. అయితే ప్రస్తుతం అన్ని వస్తువుల ధరలు పెరగడం, దాణా ధరలు విపరీతంగా పెరగడం, పశువుల ధరలు పెరగడం,గడ్డి పెంపకం అనేది ఎక్కువ ఖర్చుతో కూడుకొని ఉండడంవల్ల పాడి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. కొన్ని సమయాలలో డైరీ నిర్వాహకులు పాలు వద్దు అంటున్నారని అన్నారు. ఇప్పటికే చాలా మంది రైతులు పశువులు అమ్ముకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రైతుల జీవన పరిస్థితులు మరింత అధ్వానంగా మారే ప్రమాదం ఉందన్నారు. వెంటనే హిందూపురం లోని ప్రభుత్వ డైరీని పునరుద్ధరణ చేయాలని, సబ్సిడీ ధరలకు ప్రభుత్వం దాణా అన్ని ప్రాంతాల రైతులకు అందచేయాలని డిమాండ్ చేశారు. రైతులకు లీటర్ పై 5 రూపాయలు అదనంగా ఇవ్వాలని, పశువులకు బీమా పథకాన్ని కొనసాగించాలని, జిల్లాలో గడ్డి పెంపకానికి ప్రభుత్వం ఆర్థికంగా సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సంజీవరాయప్ప, నాగిరెడ్డి, కీర్తి, వివిధ ప్రాంతాల రైతులు పాల్గొన్నారు.

'సూపర్ సిక్స్' సభకు తరలిన తెలుగు తమ్ముళ్లు



బహిరంగ సభకు వెళుతున్న పుట్టపర్తి నాయకులు



బహిరంగ సభకు వెళుతున్న తాడిమర్రి నాయకులు, మహిళలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సూపర్ హిట్ బహిరంగ సభకు పుట్టపర్తి నియోజకవర్గం నుంచి భారీగా తెలుగు తమ్ముళ్లు బయలుదేరి వెళ్లారు. బుధవారం నియోజకవర్గంలో 6 మండలాల నుంచి మహిళలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు బస్సులలో తరలి వెళ్లారు. విద్యాసంస్థల బస్సులను నియోజకవర్గానికి కేటాయించారు. ప్రతి బస్సు పైన పల్లె సైన్యం అంటూ పోస్టర్లు అతికించారు. ఈ నియోజకవర్గానికి 175 బస్సులు కేటాయించారు. ఇవి కాక కొందరు నాయకులు సొంతంగా కారులను సమకూర్చుకొని సభకు బయలుదేరి వెళ్లారు.

నల్లమాడ : అనంతపురంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కూటమి నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. మండల నాయకులు మైలే శంకర, డాక్టర్ బుట్టి నాగభూషణం నాయుడు ఆధ్వర్యంలో అధికసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, మహిళలు తరలివెళ్లారు.


పుట్టపర్తి రూరల్ : అనంతపురం జిల్లాలో నిర్వహించిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభకు పుట్టపర్తి నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున తరలి వెళ్లారు. నియోజకవర్గంలోని ఆరు మండలాలకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో కూటమి నాయకులు తరలి వెళ్లారు. పుట్టపర్తి మండల పరిధిలోని పెడపల్లి, నిడిమామిడి, వెంగళమ్మ చెరువు, బీడుపల్లి పంచాయతీల నుండి జనం పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. పెడపల్లి శ్రీ రామ్ నాయక్, వెంగళమ్మచెరువు , శ్రీరామ్ రెడ్డి, బీడుపల్లి మారుతి, పుట్టపర్తి జయ ప్రకాష్, కొట్లపల్లి రామయ్య , రాజువారి పల్లి బుగ్గపల్లి విజయ్ కుమార్, నాగరాజు ఆధ్వర్యంలో కార్యకర్తలు నాయకులు పెద్ద సంఖ్యలో జనం తరలివెళ్లారు.

రొద్దం :అనంతపురంలో బుధవారం కూటమి ప్రభుత్వం నిర్వహించిన 'సూపర్‌సిక్స్-సూపర్‌హిట్' సభకు మండలం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి వచ్చిన టిడిపి శ్రేణులు మండల కేంద్రమైన రొద్దం నుంచి మంత్రి సవిత, హిందూపురం ఎంపి బికె.పార్థసారథి ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లో అనంతపుం వెళ్లారు.

మడకశిర రూరల్ : అనంతపురంలో జరిగిన కూటమి విజయోత్సవ సభకు మండలం నుంచి టిడిపి శ్రేణులు అత్యధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ప్రతి గ్రామపంచాయతీ నుంచి ఆర్టీసీ బస్సుల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వెళ్లారు.

తాడిమర్రి: అనంతపురంలో కూటమి ప్రభుత్వం నిర్వహించిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున కూటమి నాయకులు కార్యకర్తలు తరలివెళ్లారు. మండల పరిధిలోని దాడి తోట నాయన పల్లి పెద్దకోట్ల కునుకుంట్ల ఆత్మకూరు అగ్రహారం నిడిగల్లు చిల్ల కొండయ్య పల్లి తాడిమర్రి మొదలగు గ్రామాల నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు మహిళలు వెళ్లారు. జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు గోనుగుంట్ల భూషణ్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ కొంక నాగార్జున, టిడిపి కన్వీనర్ కూచి రాముతో పాటు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు.

'సూపర్‌సిక్స్' విజయవంతం ఓ చరిత్ర : ఎంపి అంబికా



అనంతపురం కలెక్టరేట్ : సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సభ అనంత గడ్డపై విజయవంతంగా నిర్వహించడం చరిత్రలో నిలిచిపోతుందని ఎమ్మెల్యే అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం అనంతపురంలో నిర్వహించిన సభలో ఎంపి మాట్లాడుతూ 14 ఎమ్మెల్యే సీట్లు రెండు ఎంపీ స్థానాలను గెలిపించిన ఉమ్మడి జిల్లా ప్రజానీకానికి కృతజ్ఞతలు చెప్పుకోవడం ఆనందంగా ఉందన్నారు. అనంతపురం జిల్లాలో శింగనమల నియోజవర్గంలో గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేస్తే నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల్లో 35వేల ఎకరాలకు సాగునీరు ప్రజలకు తాగునీరు అందే ఆస్కారం ఉందన్నారు. అనంతపురం కార్పొరేషన్ పరిధిలో భూగర్భ డ్రెయినేజీ వ్యవస్థకు నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. కార్గో ఎయిర్పోర్ట్ కు అనుమతి ఇవ్వాలని సీఎంకు విజ్ఞప్తి చేశారు.

ప్రాజెక్టులు పూర్తి చేయండి :ఎమ్మెల్యే సునీత



రాప్తాడు : ఉమ్మడి అనంతపురం జిల్లాకు పేరూరు, భైరవానితిప్ప ప్రాజెక్టులు జీవనాడులని వాటి పెండింగ్ పనులను పూర్తి చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభా వేదికలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభివృద్ధి వైపు అడుగులు వేస్తున్నారన్నారు. గతంలో ఒక సైకో సీఎం వల్ల రాష్ట్రం అభివృద్ధికి దూరం అయ్యిందన్నారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో పేరూరు ప్రాజెక్టు కోసం రూ.803 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు అప్పట్లో ప్రారంభించామన్నారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లలేదన్నారు. భూములు ఇచ్చిన రైతులు పరిహారం కోసం ఎదురుచూసే పరిస్థితిని వైసిపి కల్పించిందన్నారు. ఈ నేపథ్యంలో రైతులకు పరిహారం అందించేలా చూడాలని జలవనురుల శాఖ మంత్రితో పాటు ముఖ్యమంత్రి చంద్రబాబును విజ్ఞప్తి చేశారు. భైరవానితిప్ప ప్రాజెక్టు కూడా పూర్తి చేస్తే.. ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. జీడిపల్లి నుంచి పేరూరు, భైరవానితిప్ప ప్రాజెక్టులకు నీరు అందించే పనులు ఈ ఏడాదే ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు.

దేశవ్యాప్తంగా మార్మోగిన 'అనంత' పేరు : ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురం కలెక్టరేట్ : సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభతో అనంతపురం పేరు దేశవ్యాప్తంగా మారుమోగిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. అనంతపురంలో జరిగిన సూపర్ సిక్స్ - సూపర్ హిట్ విజయోత్సవ సభలో ఎమ్మెల్యే దగ్గుపాటి ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రత్యేకంగా కలిసి నాగలిని బహూకరించారు. తర్వాత పవన్‌కల్యాణ్‌ను సత్కరించారు. అంతకుముందు వేదికపై ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు మాత్రమే దక్కుతుందని అన్నారు. అనంతపురం శాసనసభ్యుడిగా తనకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు... తొలి విజయోత్సవ సభను.. ఇక్కడ నిర్వహించే అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. చరిత్రలో నిలిచిపోయే విధంగా ఈ సభకు జనం తరలి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతపురం అభివృద్ధికి సహకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు అనంతపురం ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. అక్టోబర్-2 నాటికి నగరంలో డంపింగ్ యార్డ్ సమస్యకు ముగింపు పలుకుతామని స్పష్టం చేశారు. సభ గ్రాండ్ సక్సెస్ కావడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎమ్మెల్యే దగ్గుపాటిని ప్రత్యేకంగా అభినందించారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు నాగలి బహూకరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి


15 నెలల్లోనే 'సూపర్ సిక్స్' అమలు : ఎమ్మెల్యే శ్రావణిశ్రీ



బుక్కరాయసముద్రం : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే సూపర్ సిక్స్ పథకాలను అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. బుధవారం అనంతపురంలో నిర్వహించిన 'సూపర్ హిట్' సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ సూచనలతో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్లను రూ.4వేలకు పెంచడం, మహిళలకు ఉచిత బస్సు పథకం, ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతులకు తొలి విడత రూ.7వేలు ఖాతాలో జమ చేయడం, అన్నా క్యాంటీన్ ఏర్పాటు, మెగా డీఎస్సీ నిర్వహణ వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపుతో రానున్న కాలంలో మహిళలకు నెలకు రూ.1500, నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కూడా అందించనున్నట్లు తెలిపారు.

పేదలకు మెరుగైన సేవలు : ఎమ్మెల్యే కందికుంట

కదిరి అర్బన్ : పేద, మధ్య మధ్యతరగతి ప్రజలకు మెరుగైన వైద్యం అందించడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. బుధవారం అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ సూపర్ హిట్ విజయోత్సవ సమావేశానికి హాజరైన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ప్రజలకు అందించాల్సిన వైద్యంపై పూర్తి అంశాలను సమావేశంలో వెల్లడించారు. అనారోగ్యం పాలైతే భారం కాకుండా ఆర్థిక ఇబ్బందులను ఎదురుకోకుండా ప్రభుత్వం 25 లక్షల రూపాయల విలువ గల వైద్యం అందించడానికి ఈమధ్య కాలంలోనే మంత్రివర్గం తీర్మానం చేసిందన్నారు.



రాష్ట్ర అభివృద్ధే చంద్రబాబు ధ్యేయం : ఎమ్మెల్యే పల్లె సింధూర

కొత్తచెరువు : ఒకవైపు అభివృద్ధి, మరోవైపు సంక్షేమాన్ని సమన్వయంతో నడిపిస్తూ రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్లడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పనిచేస్తున్నారని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర అన్నారు. యువతకు ఇచ్చిన మాట ప్రకారం కూటమి ప్రభుత్వం 16,347 టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహించిందన్నారు.

